

దేశానికే ఆదర్శంగా పి4 అమలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి4 దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, అదే స్ఫూర్తితో జిల్లాలో కూడా అమలు చర్యలు పకడ్బందీగా చేయాలని చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో పి4 పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, జెసి అదితిసింగ్, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీసి ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 19 నుంచి పి4 అమలు చేయాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలనకు పనిచేస్తున్న పి4 లక్ష్యాన్ని 2029 నాటికి సాధించాలని వేగంగా జిల్లాలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 'పేదరిక నిర్మూలనలో భాగంగానే పి4 కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు.

జడ్‌పిటిసి ఉప ఎన్నిక
బరిలో 22 మంది

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
ఒంటిమిట్టలో కృష్ణారెడ్డి, ఇరగంరెడ్డి
పులివెందులలో లత, హేమంత్‌రెడ్డి నువ్వానేనా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో జడ్‌పిటిసి ఉప ఎన్నికల పోరు ఖాయమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఒంటిమిట్ట, పులివెందుల ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల దగ్గర నుంచి స్క్రూటినీ వరకు ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరో తెలియని పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. మంగళవారం నామినేషన్ల స్క్రూటినీ ముగియడంతో ఎన్నికల పోరులో స్పష్టత వచ్చింది. ఒకటి నుంచి నేటి వరకు పులివెందుల జడ్‌పిటిసి స్థానానికి 12 నామినేషన్లు, ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానానికి 21 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉపసంహరణ ముగిసిన అనంతరం పులివెందులకు 11, ఒంటిమిట్టకు 11 నామినేషన్లు తుదిజాబితాలో నిలిచాయి. ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఎన్నికల ప్రచారం నువ్వానేనా అనే రీతిలో సాగుతోంది. ఇప్పటివరకు అధికార టిడిపి ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఎన్నికల బరిలో బలాబలాలను ఎదుర్కొంటోంది. ముగ్గురు టిడిపి నేతలైన మాజీ ఎమ్మెల్సీ బత్యాల, యువ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు మధ్య టిడిపి ముక్కోణపు రాజకీయాలు నడుస్తున్న సంగతి తెలిసిందే.

ఎన్నికల పోరు షురూ!

టిడిపి అధిష్టానం తమ అభ్యర్థిగా ముద్దు కృష్ణారెడ్డిని బరిలో నిలిపింది. టిడిపి, వైసిపి మధ్య పోరు ఖాయమైంది. ప్రత్యర్థి వైసిపి నాయకత్వం ఎన్నికల ప్రచారం, ఎన్నికల వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలు, డబ్బు, మద్యం తదితర అంశాల్లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. పులివెందుల టిడిపి జడ్‌పిటిసి అభ్యర్థి మారెడ్డి లత, వైసిపి అభ్యర్థి హేమంత్‌రెడ్డి మధ్య నువ్వానేనా అనే రీతిలో ప్రచారం హోరెత్తిస్తోంది. ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఎన్నికల ప్రచారం, వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడల అంశాల్లో టిడిపి వెనుకబడినట్లు కనిపిస్తోంది.

సమష్టి పోరు సాగించేనా!

రాబోయే వారం రోజుల వ్యవధిలో అధికార టిడిపి తనదైన మార్కును చూపించగలిగితేనే ప్రయోజనం ఉంటుందని వాదన వినిపిస్తోంది. టిడిపికి చెందిన ముగ్గురు నాయకులు సమష్టిగా ఎన్నికల ప్రచారం దగ్గర నుంచి ఎన్నికల వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలను రచించాల్సి ఉంది. ఇప్పటికే ప్రత్యర్థి వైసిపి గ్రామీణులను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రత్యర్థి ధీటుగా టిడిపి ఎన్నికల వ్యూహాలు, ప్రలోభాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

కడప అర్బన్ : పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ రూమ్ హాల్‌లో పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎస్‌పి అశోక్ కుమార్‌తో కలసి జడ్‌పి సిఇఒ, ఆర్ఒలు, ఎఆర్ఒలు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జడ్‌పిటిసి ఉప ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు, మాన్ పవర్, ట్రైనింగ్ ప్రోగ్రామ్స్,సెక్యూరిటీ, వసతులు, జిల్లా చెక్ పోస్టులు, కమ్యూని కేషన్ ప్లాన్స్, పోలింగ్ అధికారులు, పోలింగ్ రూట్స్, వెహికల్ రిక్వైర్మెంట్స్, పోలీస్ ఫోర్స్, చెక్ లిస్ట్, మెటీరియల్, స్వస్తిక్ గుర్తులు తదితర అంశాల కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద వెబ్ కాస్టింగ్, మొబైల్ కనెక్టివిటీ వంటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. మండలాల పరిధిలోని సెన్సిటివ్, క్రిటికల్, వల్నరబిలిటీ పోలీస్ స్టేషన్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా పరిధిలో 12 చెక్ పోస్టులు,సెన్సిటివ్, క్రిటికల్, వల్నరబిలిటీ పోలీస్ స్టేషన్ల వద్ద గట్టి బందోబస్తుఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంటింటి కాంపెయిన్‌లో భాగంగా ఆర్మర్డ్ ఫోర్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నైట్ పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో డిఎస్‌పి వెంకటేశ్వర్లు, పులివెందుల ఎఆర్ఒ కృష్ణమూర్తి, ఒంటిమిట్ట ఎఆర్ఒ సుజాతమ్మ, నోడల్ అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

అఖండ మెజార్టీతో గెలిపించాలి : 'మండిపల్లి'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మండలంలోని మంటపంపల్లికి చెందిన అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డికి అభ్యర్థిగా ప్రకటిస్తూ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా టిడిపి బి ఫారం అందజేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తల కోరిక మేరకే అధిష్టానం ముద్దు కృష్ణా రెడ్డిని ఎంపిక చేసినట్లు మంత్రి వెల్లడించారు. అందరి సమష్టి సహకారంతో మండలంలో ఈనెల 12న నిర్వహించబోయే జడ్‌పిటిసి స్థానానికి కూటమి ప్రభుత్వం తరఫున ముద్దుకృష్ణారెడ్డిని అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం రాజంపేట ఇన్ ఛార్జి జగన్మోహన్‌రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో జడ్‌పిటిసి స్థానాన్ని గెలిపించిన నారా లోకేష్‌కు, చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అభ్యర్థికి బి.ఫారం అందజేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలి

- పేదలపై భారాలు మోపేందుకే..
- అధికార, ప్రతిపక్షాలు అదానికి దాసోహం
- ప్రజా సంఘాల ఆందోళనలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్
- 'స్మార్ట్‌మీటర్లు వద్దు..విద్యుత్ భారాలు తగ్గించాలి' అంటూ ప్రజా ప్రదర్శన, ధర్నా



బద్వేల్ విద్యుత్ సబ్ జ్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు, నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

ప్రజలపై మోయలేని బాధలు వేసేందుకే అధికార ప్రతిపక్షాలు అదానికి దాసోహం అయ్యాయని, విద్యుత్ స్మార్ట్ మీటర్లతో పేదలకు శఠగోపురం పెట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, వీటిని ప్రజలు ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రజా సంఘాలు, దళిత, బహుజన, మైనార్టీ, మహిళ, పెన్షనర్ల, సిటిజన్ ఫోరం, కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా అంబేద్కర్ సర్కిల్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు వందలాది మంది ప్రజలు 'స్మార్ట్ మీటర్లు వద్దు, విద్యుత్ భారాలు తగ్గించాలి' అంటూ చేస్తూ, 'ప్రజా ప్రదర్శన' నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో నాటి పాలక, ప్రతిపక్షాలు యుపిఎ, ఎన్‌డిఎ ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణల పేరిట, ప్రభుత్వ సేవ రంగంలో ఉన్న విద్యుత్తు సంస్థలను ప్రయివేటీకరిస్తూ పార్లమెంటులో చట్టం చేశారని. దేశంలోని అంబానీ, ఆదాని లాంటి ఏడు కార్పొరేట్ సంస్థలకు విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్తు సరఫరా, వినియోగదారుల సేవలు వ్యాపారీకరణ చేశారన్నారు. రాష్ట్రంలో 1998ల నాటి టిడిపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టిందని, అప్పట్లో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ బషీర్‌బాగ్ భారీ ప్రజా ప్రదర్శన పై కాల్పులు జరిపించారని, ముగ్గురు అమరవీరులు మృతి చెందారని ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ టిడిపి ప్రభుత్వం వచ్చి రాష్ట్రంలోనే రెండు కోట్ల విద్యుత్తు కనెక్షన్లను ఆదాని కార్పొరేట్ కంపెనీకి ధారా దతం చేస్తూ భవిష్యత్తు 25 సంవత్సరాలు యూనిట్ రూ.7కు విక్రయించడానికి అగ్రిమెంటు చేసుకుందని పేర్కొన్నారు. దీని వల్ల ఏడాదికి రూ. 76 వేల అదనపు భారం ప్రజలపై పడుతుందని వివరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వీరశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు లోకేష్ టిడిపి బహిరంగ సభలో జగన్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమని పిలుపునిచ్చి తమ ప్రభుత్వం వస్తే 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తామని నమ్మ పలికారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.శివకుమార్, పట్టణ కార్యదర్శి కె. శ్రీనివాసులు, సిపిఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి బాలు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జకరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వెంకటేశు, మహిళా సంఘం నాయకులు మోక్షమ్మ, కైరున్ బి, సిఐటియు డివైఎఫ్ఐ నాయకులు, ఎఐటియుసి నాయకులు, వివిధ సంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదు

కడప అర్బన్ : స్మార్ట్ మీటర్ల రద్దు కోసం మరో బషీర్ బాగ్ ఉద్యమం తప్పదని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. మంగళవారం స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన ఇంధన సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించుకోవాలని, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కడప విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు గాలి చంద్ర, బి.మనోహర్, నాగ సుబ్బారెడ్డి, రామ్మోహన్, రమణయ్య, దస్తగిరి రెడ్డి, సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని విమర్శించారు. రోజు వారీ డిమాండ్‌ను బట్టి ఛార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఇఆర్‌సి అనుమతించడం దారుణమని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్తు యూనిట్ 1.99 కి టెండర్లు పడిన రోజుల్లో సెకితోరూ. 2.49 కు కొంటామని ఒప్పందం చేసుకోవడం సరైందని కాదని తెలిపారు. ఈ ఒప్పందంపై తొలి నుంచి వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. సెకితో ఒప్పందం వల్ల 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రజలు లక్ష కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమర్చే కాంట్రాక్ట్‌ను అదానికి కట్ట పెట్టారని విమర్శించారు. ఆందోళన కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాసులురెడ్డి, బాదుల్లా, మద్దిలేటి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకట సుబ్బయ్య, వెంకట శివ, రైతు సంఘం నాయకులు గోపాలకృష్ణయ్య, మనోహర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున, మహిళా సంఘం నాయకురాలు భాగ్యమ్మ పాల్గొన్నారు.



కడప విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు వద్దు : డివైఎఫ్ఐ

ముద్దనూరు : విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు, విద్యుత్ ఛార్జీల పెంపు విరమించుకుంటే బషీర్‌బాగ్ తరహా ఉద్యమం తప్పదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గతంలో విద్యుత్ సంస్కరణలు విద్యుత్ ఛార్జీలు పెంచడంతో ప్రజా తిరుగుబాటుతో ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ఎంతో మంది విద్యుత్ వెలుగులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతులు అధిక ధరలు చెల్లించలేక వ్యవసాయం మానుకునే పరిస్థితి వస్తుందన్నారు. విద్యుత్ వినియోగించుకోవడం ప్రతి పౌరుడి హక్కుగా ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రజల ప్రాథమిక హక్కులు కాలరాయటమే అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపుని ఆపకపోతే మరో బషీర్బాగ్ తరహా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల నాయకులు సుదర్శన్,చరణ్ చంద్ర, అజయ్, రాము పాల్గొన్నారు. **బ్రహ్మంగారి మఠం :** విద్యుత్ ఛార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్లు బిగించినా మరో బషీర్‌బాగ్ తరహా ఉద్యమం తప్పదని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో సోమిరెడ్డిపల్లి-1,2,3, తోట్లపల్లె, మల్లెపల్లె సచివాలయాల కార్యదర్శులకు, సిబ్బందికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్, గోవింద్, హరి, అజయ్ నాయకులు రాహుల్, భాగ్యమ్మ, అరవింద్, చిన్నప్ప, ప్రదీప్, శ్రీను, వీర గురుడు, పాల్గొన్నారు. **చాపాడు :** కుటమి ప్రభుత్వంలో వేగవంతం చేస్తున్న ఆదాని స్పాట్ మీటర్లను బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీట్లను వెనక్కి తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సిపిఎం వాటి అనుబంధ ప్రజా సంఘాలు మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 11 సచివాలయాల్లో కార్యదర్శులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ప్రజలుపాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ఆదాని స్మార్ట్ మీటర్లు ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారకముందే, వాటిని తిప్పికొట్టాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. జమ్మలమడుగు లక్ష్మీ నగర్ విద్యుత్ కేంద్రం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి శేఖర్, కమిటీ సభ్యుడు రవి, సిఐటియు కమిటీ సభ్యుడు దివాకర్, కమాల్‌బాషా, బాలు. రెడ్డప్ప. ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యుడు సాయికిరణ్ పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ ఆధ్వర్యంలో మైలవరం మండల కేంద్రంలోని తహశీల్దాత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు కొండయ్య, లక్ష్మీనారాయణ ,నారాయణ,సంజీవరాయుడు,దాసు,నాగన్న, ఒబయ్య, గొరిగే కృష్ణ, శేషయ్య, సురేష్, మోహన్ పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు మోపొద్దు : పిసిసి

వేంపల్లె : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారాలు మోపవద్దని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నాలుగు కూడలిలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి హాజరై సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి పాలనలో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరగడంతో బిల్లు ముట్టుకుంటే షాక్ కొట్టే విధంగా ఉన్నట్లు ఎద్దేవా చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు విషయంలో వైసిపి కంటే టిడిపి పదింతలు ప్రజలపై భారాన్ని మోపిందని పేర్కొన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి టిడిపి ప్రస్తుతం వాటిని బిగించేందుకు ఉత్సాహం చూపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, డాక్టర్ సుబ్రమణ్యం, రమణ, నాగరాజు, హన్సిక రెడ్డి, వామపక్ష నాయకులు వెంకట్రాముడు, చాంద్ బాషా, అమీర్ బాష, అనిల్, మల్లేష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కర్నూలు-కడప జాతీయ రహదారి విస్తరణకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-చెన్నూరు

రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ పనులు వేగంగా జరుగుతుండడంతో ఇటీవల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా రహదారుల విస్తరణకు శంకుస్థాపనలు మరికొన్ని రహదారులను జాతికి అంకితం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కడప - కర్నూలు నంబర్ 40వ జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా విస్తరించేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలిసింది. కొద్దిరోజుల కిందట జాతీయ రహదారిలోని చెన్నూరు వద్ద సర్వే నిర్వహించారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఫ్లైఓవర్ వంతెన నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. ఫోర్ లైన్ రహదారి విస్తరణ పనులు చేపట్టినప్పుడే చెన్నూరు వద్ద ఆరు లైన్ల కోసం విస్తరించి ఉన్నారు. వాహనాలు వేగంగా వెళుతుండడం రోడ్డు దాటుకోవాలంటే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. చెన్నూరు కొత్త రోడ్డు వద్ద ప్రమాదాలు కారణంగా అనేకమంది మృత్యువాత పడ్డారు. ఫ్లైఓవర్ వంతెన నిర్మించడం వల్ల ప్రమాదాలు తగ్గిపోతాయని స్థానికుల అభిప్రాయం. ఈ రహదారి గుండా హైదరాబాద్, కర్నూల్, నంద్యాల, మైదుకూరు, కడవ, రాయచోటి, పీలేరు, చిత్తూరు జిల్లా కేంద్రాలకు వేలకొద్ది వాహనాలు వెళ్తుంటాయి. గతంలో చెన్నూరు కొత్త రోడ్డు వద్ద ఫోర్ లైన్ విస్తరించినప్పుడే ఫ్లైఓవర్ వంతెన నిర్మించారు. కానీ చెన్నూరుకు చెందిన కొంతమంది వ్యాపారాలు దెబ్బతింటాయన్న ఉద్దేశంతో వంతెన నిర్మించకుండా అడ్డు తగ్గడంతో అప్పట్లో నిలిపివేశారు. ఇటీవల కడప - కర్నూలు జాతీయ రహదారిని ఆరు లైన్ల విస్తరణకు ప్రతిపాదనలు అధికారులకు తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు తెలిసింది.

పైలెట్ ప్రాజెక్టు అమలుకు అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - కడప అర్బన్ : 'సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహారం-వ్యవసాయ కన్వర్జెన్స్‌ను ప్రారంభించడం' అనే కార్యక్రమాన్ని జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు జిల్లా పరిపాలన యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ డిజిటల్ సైన్ చేసిన అవగాహనా ఒప్పంద పత్రాన్ని హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, బిఐపిపి అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్విని ఛాత్రేకు సంబంధిత ప్రాజెక్ట్ ప్రతినిధి, అధికారుల సమక్షంలో సమర్పించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐఎస్‌బి, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సమకూర్చే నిధులతో సాంకేతిక మద్దతు ద్వారా పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాల లభ్యత, అందుబాటు, పౌష్టిక సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి పైలెట్ ప్రాజెక్టు జిల్లాలో అమలు కానుందన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలోను, గర్భిణులు, బాలింతలకు అవసరమైన సంపూర్ణ పోషణకు అవసరమైన పోషక విలువలతో కూడిన ఆహార పంటల ఉత్పత్తిని పెంపొందించే దిశగా చర్యలు తీసుకోనున్నామని తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు మొదటి వ్యాక్సిన్

ప్రజాశక్తి-చెన్నూరు : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గుర్రమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రం లక్ష్మీ నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను చిన్నమాచుపల్లి సెక్టర్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్, మహిళా పోలీస్ సునంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల విశిష్టతను వివరించారు. బిడ్డకు తల్లిపాలు పట్టడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు తల్లి పాలు పట్టడం ద్వారా తల్లికి రొమ్ము కేన్సర్ రాదన్నారు. అనంతరం తల్లిపాల విశిష్టతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు

ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరపాలక సంస్థల పని చేస్తున్న కార్మికులకు ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నగర కమిటీ నాయకులు కోరారు. మంగళవారం అదనపు కమిషనర్ రాకేష్ చంద్రంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం ధరలకు అనుగుణంగా రూ.1800 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని పేర్కొన్నారు. 60 ఏళ్లు నిండిన వారిని తొలగించారని, వారి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షుడు సుంకరి రవి, కంచుపాటి శ్రీరాములు, ఇత్తడి ప్రకాష్, అడిషనల్ కార్మికుల కన్వీనర్ కమిటీ సభ్యులు హరికృష్ణ, పెంచలయ్య, చిన్న పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కడప : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఖరారు చేసిన షెడ్యూల్ మేరకు, 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులలో ప్రవేశాల కోసం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈనెల 18 నుంచి రిజిస్ట్రేషన్లు మొదలవుతాయని ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. జిల్లాలో ఇంటర్, లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులకోసం కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పోలీసు కానిస్టేబుల్ శిక్షణకు సన్నాహాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇటీవల ఎంపికైన స్టయిఫండరీ కేడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ సందర్శించారు. డిటిసి చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్‌లు, కిచెన్, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను పోలీస్ అధికారులతో కలసి పరిశీలించారు. శిక్షణ నిమిత్తం అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డిటిసిలో పెండింగ్ పనులను చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. శిక్షణార్థులకు శారీరక , పరేడ్ శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడే మైదానాలను పరిశీలించారు. క్లాస్ రూమ్స్, రన్నింగ్ ట్రాక్, పరేడ్ గ్రౌండ్స్, డ్రిల్ ఏరియా, బాటిల్ అబ్స్టాకల్స్ ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. శిక్షణ కేంద్రంలో వసతి సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని, వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని, సూచించారు. ఎస్‌పి వెంట డిటిసి డిఎస్‌పి, డిటిసి ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ఉన్నారు.

8న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్ : చెత్త పన్ను అవినీతిపై ఈనెల 8న కడప కార్పొరేషన్ ఎదుట సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర కార్యదర్శి రామ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అవినీతి సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి-కాశినాయన : 2023వ సంవత్సరం జులై నుంచి రావాల్సిన 12వ పిఆర్‌సిని ప్రభుత్వం ప్రకటించక కాలయాపన చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు భారంగా మారిందని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వెంటనే ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతిని విడుదల చేయాలని ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, రాష్ట్ర సిపిఎస్ కమిటీ కన్వీనర్ యు. సుబ్రమణ్యం, రాష్ట్ర కౌన్సిలరు ఓ.చంద్రహసరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సచివాలయంలోని అన్ని శాఖల ఉద్యోగస్తులకు బేసిక్ పేలో 24 శాతం హెచ్‌ఆర్‌ఎ మరో ఏడాది పొడిగించడం సంతోషించదగ్గ విషయమన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్యమైన మిగిలిన ఉద్యోగ ఉపాధ్యాయులకు కూడా వెంటనే ఐదు డిఎలు విడుదల చేయాలని, పిఆర్‌సి కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని, సిపిఎస్ ఉద్యోగులకు 2018 జులై 2019 జనవరి డిఎ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2022 సంవత్సరం నుంచి లీవ్ ఎన్ క్యాష్ మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పొజిషన్ ఐడిలు ఏర్పాటు చేసి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీజనల్ కన్వీనర్ వి.వి. కృష్ణారెడ్డి, ఎస్‌టియు నాయకులు పుల్లారెడ్డి, గురవయ్య, రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, శివప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి, సిద్దారెడ్డి, జయసింహ, పీర్ బాషా పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైవీయూలో ఎంబిఎ శాఖలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం ఇంటర్వ్యూలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్ మార్గదర్శకంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. సబ్జెక్ట్ ఎక్స్‌పెర్ట్‌గా తిరుపతి నేషనల్ సాంస్క్రిట్ విద్యాపీట్ ఎంసిఎ విభాగ ప్రొఫెసర్ జి.శ్రీధర్ హాజరు కాగా వైవీయూ ప్రొఫెసర్ ఏ.జీ.దాము, కామర్స్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, ఎంబిఎ విభాగ అధిపతి డాక్టర్ పి.సరిత, డాక్టర్ గంగయ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలలో అభ్యర్థుల మైక్రో టీచింగ్‌ను, అకడమిక్ ప్రతిభను పరిశీలించారు. విద్యార్థుల మార్కులను పరిగణలోకి తీసుకొని ఎంపికైన వారి జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

పులివెందులలో భారీ వర్షం.. రోడ్లు జలమయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. మంగళవారం రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు భారీగా వర్షం కురవడంతో రోడ్లపైకి నీరు చేరాయి. మోకాళ్లలోతుగా నీళ్లు రోడ్డు పైకి రావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు.



జలమయమైన ప్రధాన రహదారి

అవినీతిపై విచారణ చేపట్టాలి : టిడిపి

ప్రజాశక్తి కడప అర్బన్

చెత్త పన్ను వసూళ్లకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న విచారణ త్వరగా పూర్తిచేసి అందులో తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్లాప్ ప్రోగ్రాంలో అవినీతిపై విచారణ చేపట్టాలని టిడిపి కార్పొరేటర్ సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన అవినీతి ఒక ఎత్తయితే గతంలో క్లాప్ ప్రోగ్రాం సమయంలో నెలకు సుమారు రూ. కోటి మేరా అవినీతి చోటు చేసుకుందని, కార్పొరేషన్‌కు జమ చేసిన కలెక్షన్లు చూస్తే అర్థమవుతుందని తెలిపారు. ఈ విషయం వైసిపికి సంబంధించిన కార్పొరేటర్లే బల్లగుద్ది చెబుతున్నారని చెప్పారు. ప్రస్తుతం 13 నెలల్లో రూ. 8 కోట్లు అవినీతి జరిగిందని చెబుతున్నారని, దీనికి కారణం ఇక్కడ పాలకవర్గం వారే కాబట్టి వారికి ఎంత కలెక్షన్ వస్తుందనే విషయం తెలుసని పేర్కొన్నారు. ఈ విషయమై మేయర్ సురేష్ బాబు అధికారులతో సమీక్ష చేసే సమయంలో వారే ఉన్నారని తెలిపారు. డివిజన్‌లో ప్రజల నుంచి చెత్త పన్ను వసూళ్లు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పంపి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ముక్కు పిండి వసూలు చేసిన చరిత్ర వైసిపి పాలకవర్గానిదే అన్నారు. నగరంలో రూ.90,000 ఇళ్లు,15,000 కమర్షియల్ సముదాయాలు ఉన్నాయని చెప్పారు. ఇందులో ఇంటికి రూ.90, వ్యాపార సముదాలకు రూ.200 నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేశారని పేర్కొన్నారు. జెసి స్థాయి అధికారితో విచారణ చేపట్టాలని కోరారు.

కేన్సర్ వ్యాధులపై శిక్షణ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎన్‌సిడి-4.0 సర్వేలో ఉన్న కేన్సర్ వైద్యులపై శిక్షణ కార్యక్రమం మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, డాక్టర్ జీవన ప్రియ ఆధ్వర్యంలో శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమం వైఎస్ఆర్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లాలోని సెకండరీ హెల్త్ సెక్టార్‌లో పనిచేస్తున్న గైనకాలజిస్టులు, డెంటల్ వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వైద్యులు తాము పని చేస్తున్న కేంద్రాలలో మెడికల్ ఆఫీసర్లకు, స్టాఫ్ నర్స్‌లకు, సిహెచ్‌ఒలకు, ఎఎన్‌ఎంలకు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్, రిమ్స్ ప్రిన్సిపల్, ఎస్‌పిఎం డిపార్ట్‌మెంట్ శాఖధిపతి పాల్గొన్నారు.



చిలేకంపల్లె జడ్‌పి హైస్కూల్‌లో ప్రారంభించిన ఆర్‌ఒ ప్లాంట్

విద్యార్థులకు ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి - చక్రాయపేట

విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా ఉండాలని పాఠశాలలో శుద్ధ తాగునీరు అందుతుందని చిలేకంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీదేవి తెలిపారు. కడప రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమితి కార్యదర్శి ఎస్.నజీర్ అహ్మద్ పర్యవేక్షణలో మంగళవారం పాఠశాలలో తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుద్ధమైన నీరు తాగడం వల్ల నీటి సంబంధ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. సమితి ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు ఈ సహాయానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



మినీ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

ఉచితంగా కంది, జొన్న, రాగి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని పెనికలపాడు గ్రామంలో మంగళవారం ఎఒ వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత, పోషకాల యాజమాన్య పథకం కింద కంది, జొన్న, రాగి చిరుధాన్యాల (మినికిట్) రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎల్.ఆర్.జి.52 రకం కంది విత్తనాలను ఒక్కో రైతుకు 4 కిలోల చొప్పున 85 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. జొన్న సి.ఎస్.వి.41 రకం విత్తనాలు 6 ప్యాకెట్లు, రాగి ఇంద్రావతి రకం 7 ప్యాకెట్లు అందజేశామన్నారు. విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కాటమయ్య, విహెచ్ఎ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

14 వరకు పంటల బీమా చెల్లించొచ్చు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈనెల 14వ తేదీ వరకూ పంటల బీమా చెల్లించొచ్చని ఎఒ చెన్నారెడ్డి రైతులకు సూచించారు. ఎర్రబల్లి-2 రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పంటల బీమా పథకం ద్వారా లబ్ధి పొందాలన్నారు. 2025 ఖరీఫ్‌లో సాగు చేసిన అనుమతి (నోటిఫైడ్) పొందిన పంటలకు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని రైతులను కోరారు. దిగుబడి ఆధారిత పంటల బీమా పథకం కింద కేటాయించిన పంటలు వరి, కంది, మినుము, పసుపు, ఉల్లి పంటలకు గతనెల 31వరకు ఉన్న గడువును ఈనెల 14 వరకు పొడిగించారన్నారు. కంది సాగు చేసే రైతులకు ఉచితంగా కంది మినీ కిట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కందులు మినీ కిట్లు కావలసిన రైతులు రైతు సేవా సిబ్బందిని సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, ప్రభుత్వ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ, అరటి పంటల్లో తెగుళ్ల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - వేముల



పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఎఒ, రైతులు

స్థానిక పెద్ద జూటూరు, నల్లచెరువుపల్లి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎక్కువ భాగం చీనీ, అరటి సాగులో ఉన్నప్పటికీ దీనిలో ప్రధానంగా సూక్ష్మధాతు లోపాలు గుర్తించి గమనించాలని తెలిపారు. ఇత్తడితో ఇనుపధాతు లోపం నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ అన్నభేది 20 గ్రాములు, ఫుల్ నిమ్మ ఉప్పు రెండు గ్రాములు నీటితో కలిపి ఒక లీటర్ నీటిలో వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. ముఖ్య ఆకు ప్రూనింగ్ అత్యంత ఆవశ్యకమైనదని వివరించారు. వ్యాధి సోకిన కొమ్మలు, వట్టి కొమ్మలు తొలగించి సరియైన సేంద్రియ ఎరువులు వాడి తగిన పోషక ఎరువులు వాడినట్లయితే మంచి పూత, కాపు వస్తుందని సూచించారు. పూత శాతం పెరగడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు చొప్పున లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. భూమిలో పచ్చిరొట్ట కలియదున్ని సారవంతం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ సురేష్, విహెచ్ఎ మల్లిక, రైతులు, ఎపిసిఎం అఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ దేవి పద్మలత

పంట నమోదు తప్పనిసరి

- ఎఒ దేవి పద్మలత

ప్రజాశక్తి - చాపాడు

రైతులు సాగు చేసిన పంటలను ఇ-పంట నమోదు తప్పక చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని టిఓ పల్లె, రేపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను వెంటనే నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 14 వరకు వరి పంటకు బీమా చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. వరి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉప సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, ఎఇఒ సస్య, విఎఎ చిట్టిబాబు, బిటి, రైతులు పాల్గొన్నారు.

పెన్నా, కుందూ తీర ప్రాంత రైతులు బిజీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పెన్నా, కుందూ నది తీర ప్రాంతాల్లో రైతులు వరి సాగు ముమ్మరం చేశారు. ఆయా గ్రామాల్లో ఫిల్టర్ల ద్వారా సాగు నీటి అవకాశం ఉన్న ప్రాంతాల్లో వరి నాట్లు ముమ్మరం చేశారు. అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, రామదాసుపురం, రాజువారిపేట, తిప్పిరెడ్డి పల్లె, కుందూనది తీర గ్రామాల్లో కుచ్చుపాప, రామసుబ్బమ్మ కొట్టాలు, సీతారామాపురం, చాపాడు గ్రామాల పరిధిలో వరి సాగు చేప ట్టారు. జులై మెదటి వారం నుంచి వరినార్లు సాగు చేపట్టారు. చివరి వారం నుంచి వరి నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం అక్కడక్కడ వరినాట్లు వేస్తున్నారు. 3వేల ఎకరాల వరకు వరి పంట సాగైంది. కొంతమంది రైతులు మెదటి దపా సత్తువ (ఎరువు) కూడా చల్లుతున్నారు. కెసి కాలువకు ఈ ఏడాది నీటిని త్వరగా విడుదల చేశారు. అయినా గత వారం నుంచి మాత్రమే వరినార్లు సాగు చేపట్టారు. రైతులు ప్రస్తుతం విత్తనాలు, ఎరువుల సేకరణలో నిమగ్నమయ్యారు. కెసి కాలువకు త్వరగా నీరు విడుదలైతే 13వేల ఎకరాలలో వరి పంట సాగయ్యే అవకాశం ఉంది. గతేడాది మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 14వేల ఎకరాలలో వరి పంట సాగైంది. సాగు నీరు త్వరగా విడుదల కావడంతో ఈ ఏడాది సాగు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. వరి సాగుకు ఆసక్తి కనబరచని రైతులు మినుము, మొక్కజొన్న సాగుకు సిద్ధపడుతున్నారు. వెదురూరు, నరహరిపురం, రాజుపాలెం, తిప్పిరెడ్డిపల్లె, సిద్దారెడ్డిపల్లె గ్రామ రైతులు మొక్కజొన్న సాగు చేపడుతున్నారు.



కెసి కాలువ పరిధిలో వరిసాగుకు సిద్ధమవుతున్న నారు

ఉప ఎన్నికలో పటిష్ట నిఘా : డిఎస్‌పి



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న డిఎస్‌పి మురళీనాయక్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నిక సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడెక్కడ ఎంత బందోబస్తు ఏర్పాటు చేయాలి.. ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాలపై కిందిస్థాయి అధికారులతో చర్చించారు. ఎన్నికల జరిగే గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అల్లర్లు జరిగే గ్రామాలు ఏవైనా ఉంటే ముందుగానే గుర్తించి అక్కడ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ ఉండాలన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిత్యం తనిఖీలు చేయాలన్నారు. ఎలాంటి మారణాయుధాలు, అక్రమ డబ్బు గ్రామాలకు వెళ్లకుండా చూడాలన్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ నెల 12న జరిగే ఉప ఎన్నికల్లో తగిన చర్యలు తీసుకోవడంతోపాటు పోలింగ్ అనంతరం ఇవిఎం బాక్స్‌లను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ చాంద్ బాషా, ట్రాఫిక్ సిఐ హాజీవల్లి పాల్గొన్నారు.

పులివెందులలో ప్రచారంపై పోలీస్ 'డ్రోన్' నిఘా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఈనెల 12న జరుగనున్న పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నిక నేపథ్యంలో ఆయా పార్టీల ప్రచారంపై పోలీస్ శాఖ 'డ్రోన్' నిఘా పెట్టింది. ఎస్‌పి ఇజి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు అత్యాధునిక డ్రోన్ కెమెరా ద్వారా ఇరు పార్టీలు చేసే ప్రచారాలపై నిఘా ఉంచుతున్నారు. మంగళవారం ఆర్.తుమ్మలపల్లి, నల్లపురెడ్డిపల్లి, రాగిమానిపల్లి, రాయలాపురం ప్రాంతాల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచారంపై డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షించారు. వివిధ పార్టీల అభ్యర్థులు చేస్తున్న ప్రచారం ప్రశాంత వాతావరణంలో జరిగేలా, ఓటర్లు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పులివెందుల అర్బన్ సిఐ చాంద్ బాషా, రూరల్ సిఐ ఎన్. వెంకటరమణ, ట్రాఫిక్ సిఐ హాజీవలి, పులివెందుల టౌన్ ఎస్‌ఐలు వి. నారాయణ, విష్ణునారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారాన్ని డ్రోన్ కెమెరాతో తీసిన ఫొటో

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం : డిప్యూటీ డిఎంహెచ్ఒ



తల్లిపాల గురించి వివరిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ మల్లేష్

ప్రజాశక్తి - ఖాజీపేట

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టదాయకమని, వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మల్లేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల గురించి ప్రజలకు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కొనసాగిన ర్యాలీ బస్టాండ్ కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఒ మల్లేష్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన చిన్నారులకు తల్లిపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యవంతంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ ముబీన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి, ఆశా వర్కర్లకు సూచనలిస్తున్న వైద్యాధికారి జ్యోత్స్న

ఎర్రగుంట్ల : బిడ్డకు తల్లిపాలు అమృతం వంటిదని రూరల్ వైద్యాధికారి జ్యోత్స్న తెలిపారు. పట్టణంలోని రాణివనం ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం వైద్య సిబ్బందికి, ఆశా వర్కర్లకు తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కార్యక్రమాలను వివరించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎండిహెచ్ఎ అధికారి, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చాపాడు : పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు పట్టించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ సూచించారు. మంగళవారం పల్లవోలు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. 6 నెలలు నిండిన చిన్నారులకు తల్లిపాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే అనుబంధ పోషకాహారాన్ని ఇవ్వాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, వరలక్ష్మీ, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

దువ్వూరు : దువ్వూరు అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్‌వైజర్ వలరక్ష్మి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : తల్లిపాలకు వేరే ప్రత్యామ్నాయం ఏమీ లేదని డాక్టర్ మోహన్‌కాంత్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం శ్రీనివాస నగర్‌లోని యుపిహెచ్‌సి పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తల్లిపాలు కల్తీ లేని స్వచ్ఛమైనవి అన్నారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. డాక్టర్ మధుకుమార్ మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రయివేట్ టీచర్లకూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులివ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రయివేట్ టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉపాధ్యాయ సేవలకుగానూ అవార్డులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రమే అని కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అటెండర్ స్థాయి ఉద్యోగి పిల్లల నుండి అఖిల భారత సర్వీసెస్‌లలో పనిచేసే వారి పిల్లల వరకు విద్యాబుద్ధులు నేర్పి నీట్, జెఇఇ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలలో పదవ, ఇంటర్మీడియట్ వంటి పరీక్షలలో ఉత్తమ ర్యాంకులకు కారకులు ప్రయివేట్ టీచర్స్, లెక్చర్స్ కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రయివేట్ అధ్యాపకుల శ్రమను గుర్తించాలని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వీరికి కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



చంద్రబాబును కలిసిన హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, సభ్యులు

హజ్‌హౌస్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- ముఖ్యమంత్రిని కోరిన హజ్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కడప హజ్‌హౌస్ పెండింగ్ పనులను పూర్తి చేయలని ముఖ్యమంత్రి చంద్రబాబును హజ్‌హౌస్ కమిటీ చైర్మన్ హస్సన్ బాషా, డైరెక్టర్ మహబూబ్ బాషా, సభ్యులు కోరారు. ఆ మేరకు వారు విజయవాడ సెక్రెటరీయేట్‌లో మంగళవారం ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలో కూడా ముస్లిం మైనార్టీలకు కొత్త హజ్‌ను నిర్మించాలని కోరారు. ఇందుకు సిఎం సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామన్నారని సభ్యులు తెలిపారు. గడిచిన, గడుస్తున్న 2025 సంవత్సరం వరకు హజ్ యాత్రకు వెళ్లే వారు ఇతర రాష్ట్రాల విమానాశ్రయం నుంచి వెళ్లే వారు. 2026 నుండి హజ్ యాత్రకు వెళ్లేందుకు విజయవాడ విమానాశ్రయం నుంచి వెళ్లే అవకాశం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర విమానశాఖ మంత్రి రాంమోహన్ నాయుడు, మైనార్టీ మంత్రి ఫారుక్, ప్రభుత్వ మైనార్టీ సలహాదారులు షరీఫ్‌కు హజ్ కమిటీ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హజ్ యాత్రకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి వెళ్లే వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందిచడం పట్ల మైనార్టీలు హర్షం వ్యక్తం చేశారు.



టిడిపిలోకి చేరిన వారితో బీటెక్ రవి

వైసిపి నుంచి టిడిపిలోకి 30 కుటుంబాలు చేరిక

- ఇరుపార్టీలకు ప్రతిష్టాత్మకంగా పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నిక వైసిపి, టిడిపికి ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం కణంపల్లె, ఈ కొత్తపల్లె, నల్లపురెడ్డిపల్లె గ్రామాలకు చెందిన సుమారు 30 కుటుంబాలు పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి, ఆయన సోదరుడు జయభరత్‌రెడ్డి సమక్షంలో ఈ కొత్తపల్లి టిడిపి నాయకులు పుష్పగిరి ఓబుల్‌రెడ్డి, పుష్పనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరాయి. వీరికి బీటెక్ రవి టిడిపి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్రబల్లె, నల్లపురెడ్డిపల్లె రైతుల జీవనాడీ అయిన ఎర్రబల చెరువుకు శాశ్వతంగా పిబిసి నీళ్లు అందించేందుకు ప్రత్యేక కాలువ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. త్వరలోనే ఆ చెరువును నీటితో నింపుతామన్నారు. ఈనెల 12న జరిగే జడ్‌పిటిసి ఉప ఎన్నికలో టిడిపి అభ్యర్థి లతారెడ్డికి ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

అర్హులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సామాజిక అధికార శిబిర్ ఆధ్వర్యంలో ఎఎల్ఐఎంసి వారి సౌజన్యంతో ఉచితంగా విభిన్నప్రతిభావంతులకు పరీక్షలు నిర్వహించి ఉపకరణాలు ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ వెంకటరమణయ్య తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విభిన్నప్రతిభావంతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్హుల పేర్లను నమోదు చేసుకున్నారు. వీలైనంత త్వరగా ఉపకరణాలు అందజేస్తామని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ శివప్రసాద్, హెచ్ఎం రామాంజనేయులు రెడ్డి, కూటమి నాయకులు కత్తి ప్రతాపరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంజీవరెడ్డి, వైద్యులు, ఎఎల్ఐఎంసి ప్రతినిధులు పాల్గొన్నారు.

రెన్యూవల్ సమయంలో వడ్డీ మాత్రమే చెల్లించేలా చర్యలు

వేంపల్లె : స్టేట్ బ్యాంక్‌లో ఖాతాదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తామని ఆర్ఎం కిషోర్ పేర్కొన్నారు. వేంపల్లె స్టేట్ బ్యాంకులో ఉన్న సమస్యలపై ఫోన్‌లో మంగళవారం ఆర్ఎం కిషోర్‌ను విలేకరులు సంప్రదించగా మైరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. బంగారు రుణాలకు సంబంధించి రిజర్వ్ బ్యాంకు నిబంధనలు ప్రకారం రెన్యూవల్ చేసుకొనే సమయంలో రుణాన్ని పూర్తిగా చెల్లించాలని చెప్పారు. అయితే ఖాతాదారులను దృష్టిలో పెట్టుకొని రెన్యూవల్ చేసుకొనే సమయంలో వడ్డీ మాత్రమే చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది అలా చేయకపోతే తన దృష్టికి తీసుకు రావాలని ఆయన సూచించారు.